## క్లుప్తంగా

### ఎన్‌జీఓ మహాసభలకు ఎమ్మెల్యే సింహాద్రికి ఆహ్వానం



**అవనిగడ్డ:** ఈనెల 21, 22 తేదీల్లో జరుగనున్న ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర మహాసభలకు స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుని ఎన్‌జీవో నేతలు ఆహ్వానించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఎన్‌జీఓ జిల్లా ఉపాధ్యక్షుడు బి. రాజేంద్రకుమార్ ఎమ్మెల్యే సింహాద్రిని కలిసి మహాసభల ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో దివి యూనిట్ ప్రెసిడెంట్ ఎస్. సురేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్. వెంకట స్వామి, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం

**మచిలీపట్నంటౌన్:** ఏపీఎస్ ఆర్టీసీ మచిలీపట్నం డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలను, సలహాలను తెలుసుకునేందుకు శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని డీఎం టి. పెద్దిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రయాణికులు సమస్యలు, సలహాలను సెల్: 99592 25462 నంబర్‌కు ఫోన్ చేసి తెలుపవచ్చన్నారు.

### హెల్మెట్ వినియోగంపై అవగాహనా ర్యాలీ



**కృత్తివెన్ను:** వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని కృత్తివెన్ను ఎస్‌ఐ గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం సీతనపల్లి సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. కృత్తివెన్ను ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ కుమారుడు వంశీకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో మృతిచెందాడు. శుక్రవారం అతని పుట్టిన రోజును పురస్కరించుకుని ఎంపీపీ మరో కుమారుడు కిరణ్‌కుమార్ 100 మంది ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌లను ఉచితంగా అందజేశారు. అనంతరం పోలీసులు, ప్రజలు హెల్మెట్‌లు ధరించి సీతనపల్లి నుంచి సంగమూడి వరకు ర్యాలీ నిర్వహించి హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

### గీజర్లు అందజేత



**చల్లపల్లి:** బెంగళూరుకు చెందిన దాతలు స్థానిక పార్వతమ్మ తోటలోని ఆదరణ గృహం వృద్ధాశ్రమానికి సహాయం చేశారు. దివంగత తుమ్మల రోహిత్ ప్రభాత్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు తుమ్మల జయకిషోర్–విజయలక్ష్మి, సోదరుడు హరి ప్రభాత్ ఆర్థిక సాయంతో రూ.15 వేల విలువైన రెండు గీజర్లను శుక్రవారం యార్లగడ్డ సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. దాతలకు ఆశ్రమ నిర్వాహకులు జంజనం రామ్మోహన రావు, శారా కృతజ్ఞతలు తెలిపారు.

### సర్వజన ఆస్పత్రిలో అందుబాటులోకి థైరాయిడ్ టెస్ట్

**మచిలీపట్నంటౌన్:** జిల్లా సర్వజన ఆస్పత్రిలో థైరాయిడ్ టెస్ట్ అందుబాటులోకి వచ్చిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. థైరాయిడ్ వ్యాధితో బాధపడుతున్న వారు సంబంధిత ఓపీ విభాగానికి వెళ్లి వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు థైరాయిడ్ టెస్ట్ చేయించుకోవచ్చునన్నారు. దీనిని మచిలీపట్నం పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### పాత ఇనుము వేలం ద్వారా పంచాయతీకి ఆదాయం

**చల్లపల్లి:** గ్రామ పంచాయతీకి పాత ఇనుము వేలం ద్వారా ఆదాయం లభించింది. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అధ్యక్షతన బహిరంగ వేలం నిర్వహించారు. పాత ఇనుము రూ.47,500లకు, పాత వీధి దీపాల సామగ్రి రూ.14,500లకు, పాత పేపర్లు రూ.వెయ్యికి హెచ్చు పాటదారులు సొంతం చేసుకున్నారు. కార్యక్రమాన్ని పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు పర్యవేక్షించారు.

### ఏడుగురు జూదరుల అరెస్ట్

**పెదకళ్లేపల్లి(మోపిదేవి):** మండల పరిధి పెదకళ్లేపల్లి కృష్ణానది ఒడ్డున జూదం ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ సీహెచ్ పద్మ సిబ్బందితో కలిసి శుక్రవారం దాడి చేశారు. 11 ద్విచక్ర వాహనాలను, ఐదు సెల్ ఫోన్లను, రూ. 7,165 నగదును స్వాధీనం చేసుకున్నారు. జూదాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

# శాస్త్రీయ పద్ధతిలో సాగు మేలు



పచ్చగా కళకళలాడుతున్న వరి చేను



ఎరువులను చల్లుతున్న రైతు

- వ్యవసాయంలో మితంగా ఎరువులు వాడాలి
- రసాయన ఎరువులకు దూరంగా ఉండాలి
- రైతులకు ఖర్చులు తగ్గి.. అధిక లాభాలు

**కృత్తివెన్ను:** వరి సాగు చేసే రైతులు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి. వారి సూచనల మేరకు తగు మాత్రంగా ఎరువుల వాడాలి. పరిమితికి మించి ఎరువులు వాడినా, రసాయనిక ఎరువులు వాడినా ఆ ప్రభావం ఖచ్చితంగా పంట దిగుబడిపై చూపుతుందని ఏఓ జెన్ని అంటున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా సుమారు 85 శాతం మేర నాట్లు పూర్తయ్యాయి. పంట వేసి 50 రోజులు కావస్తోంది. ఈ దశలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆమె మాటల్లోనే..

#### కాంప్లెక్స్ ఎరువులు వద్దు...

ప్రస్తుత దశలో ఎలాంటి కాంప్లెక్స్ ఎరువులను ఉపయోగించరాదు. వీటిని దమ్ము సమయంలో మాత్రమే వేసుకోవాలి. దమ్ము సమయంలో ఎకరం విస్తీర్ణానికి గాను 100 కిలోల సూపర్, 15 నుంచి 20 కిలోల వేప యూరియా, 15 నుంచి 20 కిలోల పొటాష్ వేసుకోవాలి. ప్రస్తుత సమయంలో 20 నుంచి 30 రోజులు దాటిన పొలానికి ఎకరం విస్తీర్ణానికి 20 కిలోల యూరియాను వేసుకుంటే సరిపోతుంది. 55 నుంచి 60 రోజుల పొలానికి అంటే పాలు పోసుకునే దశలో 20 కిలోల యూరియా వేసుకోవాలి. కాంప్లెక్స్ ఎరువులు వాడితే భాస్వరం మొక్కకు అందక పోగా నేల సారాన్ని అది దెబ్బతీస్తుంది. అందుచేత పైపై ఎరువులు కాకుండా సూటి ఎరువులు మాత్రమే వేసుకోవాలి.

#### తెగుళ్ల నివారణ ఇలా..

చేనుకు ఆకుముడత, కాండం తొలిచే పురుగు ఆశిస్తే ప్రొఫినోఫాస్ 2 ఎంఎల్‌ను ఒక లీటరు నీటిలో, అసిఫైట్ 1.5 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కలుపు మొక్కలు అధికంగా ఉంటే అధికారుల సూచనల మేరకు సంబంధిత మందును పిచికారీ చేయాలి. ప్రస్తుతం చాలా భూముల్లో కలుపు తక్కువగానే ఉంది. దీంతో రైతులు మందులపై కాకుండా కలుపు నివారణకు వ్యవసాయ కూలీలను ఉపయోగించవచ్చు. దీని వల్ల చేలలో మొక్కల మొదలు (కుదురు) కదలిక వల్ల మొక్కలు మరింత ఏపుగా పెరిగేందుకు దోహదపడుతుంది.

**నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం**

| మండలం | సాగు విస్తీర్ణం (ఎకరాలు) |
|---|---|
| పెడన | 24,468 |
| గూడూరు | 23,683 |
| బంటుమిల్లి | 16,553 |
| కృత్తివెన్ను | 7,200 |
| మొత్తం | 71,904 |

# భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో పెడనలోని పైడమ్మ అమ్మవారు



అవనిగడ్డలో స్వామి వారి శాంతి కల్యాణం



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

**పెడన:** శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావడంతో ముత్తయిదువలు ఇళ్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు దేవాలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. పట్టణంలోని పైడమ్మ అమ్మవారి దేవస్థానంతో పాటు కన్యకా పరమేశ్వరి ఆలయం, బ్రహ్మపురంలోని చౌడేశ్వరి ఆలయం, శ్యామలాంబ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పైడమ్మ అలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. దేవదాయ శాఖాధికారి మోహనరావు, కౌన్సిలర్ పిచ్చిక సతీష్, కమిటీ చైర్మన్ ఆసాది తోట వెంకట రామారావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

#### వైభవంగా శాంతి కల్యాణం..

**అవనిగడ్డ:** స్థానిక లక్ష్మీనారాయణ స్వామి వారి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు దీవి నరసింహమూర్తి, బాలకృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఉయ్యూరుకు చెందిన శ్రీనివాస దంపతులు స్వామి వారి కల్యాణం జరిపించారు. గీతా మందిరంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త యర్రంశెట్టి శ్రీహరిబాబు పర్యవేక్షించారు.

#### అన్నపూర్ణాదేవికి గాజుల అలంకరణ..



గాజుల అలంకరణలో అన్నపూర్ణాదేవి

**భావదేవరపల్లి(నాగాయలంక):** గ్రామంలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం తొలి శుక్రవారం అమ్మవారికి ఐదు వేల గాజులతో అలంకరణ మహోత్సవం జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజన రావు పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు శ్రీహరి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. 60 మంది మహిళలు పీటలపై కూర్చున్నారు. తొలుత స్వామి వారికి అభిషేకాలు జరిగాయి. గ్రామ మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండల పరిధి గణపేశ్వరంలోని దుర్గమ్మను శ్రావణ శుక్రవారం సందర్భంగా మల్లెపూలతో అలంకరించారు.

# గ్రామాల్లో సీసీ రోడ్ల అభివృద్ధి

**ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు**



నాగాయితిప్పలో రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

**నాగాయితిప్ప(మోపిదేవి):** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో కూడా సీసీ రోడ్లు వేయించి అభివృద్ధి చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధి నాగాయితిప్ప గ్రామంలో రూ. 19.16 లక్షలతో వేసిన మూడు సీసీ రోడ్లను శుక్రవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. గ్రామంలో స్థానికులు అడిగిన రోడ్లను కూడా వేస్తామని తెలిపారు. పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా సచివాలయానికి కేటాయించిన రూ. 20 లక్షలలో రూ. 15 లక్షలు, పంచాయతీ నిధుల నుంచి రూ. 4.16 లక్షలతో మూడు సీసీ రోడ్లు నిర్మించామని చెప్పారు. స్థానిక రామాలయం నుంచి పోతురాజు గుడి వరకు 140 మీటర్ల పొడవున సచివాలయం నిధులు రూ. 5 లక్షలు, పంచాయతీ నిధులు రూ. 4.16 లక్షలతో ఒక సీసీ రోడ్డు, రెండోది మెయిన్ రోడ్డు నుంచి దిడ్ల నారాయణరావు ఇంటి వరకు 97 మీటర్ల పొడవున గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు, మూడోది జి. శ్రీనివాసరావు ఇంటి నుంచి వి. రాంబాబు ఇంటి వరకు 86 మీటర్ల పొడవున గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 5 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామని వివరించారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి), కొలసాని వెంకట కృష్ణ, ఎంపీటీసీ సనకా వెంకట సురేష్‌బాబు, పీఏసీఎస్ చైర్ పర్సన్లు, నాయకులు పాల్గొన్నారు.

# వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం

**అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్న వైఎస్సార్ సీపీ సభ్యులు**

**మోపిదేవి:** అభివృద్ధి పనులను టీడీపీ పాలకులు అడ్డుకోవడం తగదని వైఎస్సార్ సీపీ సభ్యులు అన్నారు. అభివృద్ధి పనులపై టీడీపీ, వైఎస్సార్ సీపీ సభ్యుల మధ్య వాగ్వివాదంతో మండల పరిషత్ సమావేశం శుక్రవారం వాడీవేడిగా జరిగింది. సమావేశం మోపిదేవి విద్యా శాఖ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా సచివాలయానికి కేటాయించిన నిధులకు కూడా టీడీపీ పాలకులు అడ్డు పడటం గ్రామాభివృద్ధిని అడ్డుకోవడమే అవుతుందని వైఎస్సార్ సీపీ సభ్యులు అన్నారు. పలు అంశాలపై అధికారులు సమాధానం ఇస్తుండగా బొబ్బర్లంక సర్పంచ్ దొప్పలపూడి గంగాభవానీ తమ పంచాయతీ తీర్మానంలో చేసిన పనికి కాకుండా వేరే రోడ్డుకు గడప గడపకు నిధులు కేటాయించడాన్ని తప్పుపట్టారు. పంచాయతీ తీర్మానాన్ని కాదని వేరే రోడ్డుకు నిధులు ఎందుకు కేటాయించారని, దీనికి సమాధానం చెప్పాలంటూ బైటాయించారు. ఆమెకు మద్దతుగా కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల రాంబాబు, పెదకళ్లేపల్లి సర్పంచ్ అరజా సంధ్యారాణి, కో–ఆప్షన్ సభ్యులు చందన రంగారావు బైటాయించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఎంపీపీ సూచనల మేరకు గ్రామ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరరావు సమాధానం చెబుతుండగా లిఖిత పూర్వకంగా రాసివ్వాలని పట్టుపట్టారు. ఉన్నతాధికారుల సూచనలతో ఆ రోడ్డుకు ప్రపోజల్స్ పంపామని ఆయన స్పష్టంచేశారు. గ్రామాల్లో అభివృద్ధి చేస్తుండగా ఎమ్మెల్యే పేరును ఎందుకు లాగుతున్నారని నాగాయతిప్ప సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు, తోపులాట జరిగింది. జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఎంపీడీఓ కె. రామలింగేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు అధికారులు పాల్గొన్నారు.

# ఇంటింటా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు**



వృద్ధురాలి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సింహాద్రి

**కోడూరు:** ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని చేరువ చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం చింతకోళ్ల, మందపాకల, చినదిబ్బ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి రమేష్‌బాబు 324 గృహాలను సందర్శించి ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. సంక్షేమ సమాచారానికి సంబంధించిన బ్రోచర్లు అందించి, పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయడంతో పాటు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టామని వివరించారు. పలువురు గ్రామస్తులు రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టాలని కోరగా.. సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత తమ కష్టాలు తొలిగాయని చెప్పారు. పథకాల అమలుపై హర్షం వ్యక్తంచేశారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీర వెంకట నారాయణరావు, సచివాలయాల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, సర్పంచి అద్దంకి శివప్రసాద్,ఎంపీటీసీలు, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

#### బుద్ధప్రసాద్ అసత్య ప్రచారం మానుకోవాలి

**నాగాయితిప్ప(మోపిదేవి):** ప్రభుత్వంపై మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ చేస్తున్న అసత్య ప్రచారాన్ని చూచి ప్రజలు నవ్వుకుంటున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. నాగాయితిప్ప గ్రామంలో శుక్రవారం అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. డెల్టా ఆధునికీకరణ పనులకు కేటాయించిన రూ. 165 కోట్లకు రత్నకోడుపై అవుట్‌పాల్ స్లూయిజ్ అభివృద్ధి చేయకపోవడానికి కారణమేమిటో సమాధానం చెప్పాలని, అన్ని ఆధారాలతో ఎక్కడికైనా డిబేటింగ్‌కు రావడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. మీకు సంబంధించిన వారినే తెచ్చుకోవాలని, తాను రుజువు చేయకపోతే రాజకీయాలకు దూరంగా ఉంటానని సవాల్ చేశారు. సమాధానం లేక సీబీఐ దర్యాప్తు వేయించుకోవాలని దాట వేస్తున్నారని విమర్శించారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పథకాల అమలుతో అన్నివర్గాల్లో ఆనందం

**పేర్ని కిట్టు**



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

**మచిలీపట్నంటౌన్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగి ఆనందంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. మూడో డివిజన్‌లో కార్పొరేటర్, డెప్యూటీ మేయర్ శీలం భారతితో కలిసి పేర్ని కిట్టు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలను ఆదుకునేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ పథకాల వల్ల అన్నివర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా జీవిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి దీవించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆరో డివిజన్ కార్పొరేటర్ పర్ణం సతీష్, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## రేపు గద్దర్ సంస్మరణ సభ

**మచిలీపట్నంటౌన్:** ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభ ఆదివారం మచిలీపట్నంలోని గాడెల్లి కల్యాణ మండలంలో జరుగుతుందని దళిత జేఏసీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు (జానీ) తెలిపారు. శుక్రవారం సంస్మరణ సభ కరపత్రాలను జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక లక్ష్మీటాకీసు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి భారీ బైక్ ర్యాలీ, సాయంత్రం గాడెల్లి కల్యాణ మండపంలో సంస్మరణ సభ జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, ప్రధానవక్తగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని), రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటారన్నారు.

# మహిళలకు రక్షణగా నిలుద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు

**అవనిగడ్డ:** బాలికలు, మహిళలపై లైంగిక దాడులకు వ్యతిరేకంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆడబిడ్డకు రక్షణగా నిలుద్దాం పేరుతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం నుంచి వంతెన సెంటర్ వరకూ ర్యాలీ జరిగింది. అనంతరం రాజీవ్ గాంధీ చౌక్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పి. శేషుకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాలికల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. బాలికల పట్ల వివక్షత చూపక బాలురతో సమానంగా చూడాలన్నారు. బాలికలు, మహిళల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడితే నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు, బాలికల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఓలేటి రత్నమాల, పి. రాజేశ్వరి, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

## నేడు కొంగంచర్ల సర్పంచ్ పదవికి ఉప ఎన్నిక

**పెడన:** మండలంలోని కొంగంచర్ల పంచాయతీ సర్పంచ్, కాకర్లమూడి పంచాయతీ నాలుగో వార్డు సభ్యుని ఉప ఎన్నిక పోలింగ్ శనివారం జరుగుతుంది. పోలింగ్ సిబ్బంది సంబంధిత సామగ్రితో శుక్రవారం సాయంత్రం పోలింగ్‌బూత్‌లకు చేరుకున్నారు. కొంగంచర్లలో ఎన్నికల అధికారి అశోక్‌కుమార్, అదనపు ఎన్నికల అధికారి అహ్మద్‌తో పాటు పీఓ, ఇద్దరు ఏపీఓలు, ఒక సహాయకుడు చేరుకుని పోలింగ్‌కు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు సక్రమంగా ఉన్నదీ లేనిది సరిచూసుకున్నారు. 469 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాకర్లమూడిలో వార్డు సభ్యుని ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహణకు పీఓ, ఏపీఓ, సహాయకులు చేరుకున్నారు. వీరితో పాటు ఎన్నికల అధికారి అప్పల నరసమ్మ, అదనపు ఎన్నికల అధికారి నాగరాజు సంబంధిత సామగ్రిని, బ్యాలెట్ పేపర్లను సరిచూసుకుని, అంతా బాగానే ఉన్నాయని ఉన్నతాధికారులకు రిపోర్టు చేశారు. రెండు చోట్లా అత్యంత సమస్యాత్మక ప్రాంతాలు కావడంతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు. పోలింగ్ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుంది.

**ఏర్పాట్లు పూర్తి..**

**గూడూరు:** పోలవరంలోని 11వ వార్డు ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తామని ఎన్నికల అధికారి ఎస్ఎస్ఎస్ కుమార్ తెలిపారు. బీసీ మహిళకు రిజర్వు అయిన వార్డు ఎన్నికల బరిలో వైఎస్సార్ సీపీ బలపర్చిన పిచ్చుక విజయ నాగ వెంటక లక్ష్మి, తెలుగుదేశం పార్టీ మద్దతుగా వీరంగి నాగమణిలు పోటీ పడుతున్నారు. వార్డులో మొత్తం 215 ఓట్లు ఉన్నాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితాలు వెల్లడిస్తారు. గూడూరు డెప్యూటీ తహసీల్దారు వై.శివశంకర్ శుక్రవారం ఏర్పాట్లను సమీక్షించారు.

# అంకిత భావంతో పనిచేయండి

**న్యాయమూర్తి రామకృష్ణయ్య**



మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

**చిలకలపూడి(మచిలీపట్నం):** విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక నిర్మలా కాన్వెంట్ సమీపంలో సచివాలయ ఉద్యోగుల శిక్షణ కార్యాలయంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులుగా ఉన్న మీరు సర్టిఫికెట్లు అందించడంతో పాటు రిజిస్ట్రేషన్లు కూడా చేస్తున్నందున అన్నీ క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. సర్టిఫికెట్ల జారీ, రిజిస్ట్రేషన్‌లో ఏమైనా తప్పులు జరిగితే చట్టప్రకారం ఉద్యోగులే బాధ్యులవుతారన్నారు. సదస్సులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య, ఫ్యాకల్టీలు రామస్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### నిత్యాన్నదానానికి కందిపప్పు వితరణ

**మోపిదేవి:** స్థానిక వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి విశాఖపట్నానికి చెందిన ఎ. వాసు పేరున నందిగం అభిషేకరావు 30 కిలోల కందిపప్పును ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందజేశారు. నందిగం అశోక్, ఎం. వెంకటేశ్వర రావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## కృష్ణా విశ్వవిద్యాలయంలో మొక్కలు నాటిన విద్యార్థులు

**కోనేరుసెంటర్:** కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విభాగం విద్యార్థులు ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా నా మట్టి–నా దేశం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి పరిసరాలను పరిశుభ్రం చేశారు. విశ్వవిద్యాలయం అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డి.రామశేఖర్‌రెడ్డి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

**సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..**

**పెడన:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మచిలీపట్నం బ్రాంచ్ సహాయ ఫౌండేషన్‌కు 500 మొక్కలను ఇచ్చింది. వాటిని శుక్రవారం పెడనలోని మొక్కలు పెంచడానికి ఆసక్తి చూపించిన వారికి సహాయ ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలో పార్కు వద్ద మొక్కలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉస్మాన్‌బాషా, ఫౌండేషన్ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.